సాక్షి తిరుపతి

శనివారం ౹ 30 ౹ మార్చి ౹ 2024

I



అన్నింటా డేగ కన్ను

సార్వత్రిక ఎన్నికలను పటిష్టంగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం శ్రమిస్తోంది. పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. - IIలో



ఆకట్టుకున్న టాలెంట్ ఫెస్ట్

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో నాలుగు రోజుల పాటు కొనసాగనున్న టాలెంట్ ఫెస్ట్-2024 ఘనంగా జరుగుతోంది. - IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సా)	సహర్ ఆదివారం (ఉ)
తిరుపతి	6-27	4-50
గూడూరు	6-22	4-46

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో ఎన్నికల మానిటరింగ్ సెల్ ఏర్పాటు

–హెల్ప్‌లైన్ నెంబర్ 0877 2236007



కలెక్టరేట్‌లోని హెల్ప్ డెస్క్

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్‌లో ఎన్నికల మానిటరింగ్ సెల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా అధికారులు హెల్ప్ డెస్క్ పేరుతో పది మంది సిబ్బందిని నియమించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. 0877 2236007 నంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులను అందుకుంటున్నారు. ఎన్నికలకు సంబంధించి సమస్యలు ఉంటే వాటిని సైతం నివృత్తి చేస్తున్నారు. దీంతో ఫిర్యాదుదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

1 నుంచి పాలిసెట్ ఉచిత శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి ఏప్రిల్ 27న పాలిసెట్ ప్రవేశ పరీక్షను రాష్ట్ర సాంకేతిక బోర్డు నిర్వహించనున్నట్లు తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఈ పరీక్షకు ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాసిన వారు, పది, తత్సమానమైన విద్యార్హత కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ క్రమంలో తమ కళాశాలలో ఏప్రిల్ 1 నుంచి 24వ తేదీ వరకు పాలిసెట్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే తమ హెల్ప్ లైన్ సెంటర్ ద్వారా పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 94402 10803లో డాక్టర్ ఎస్‌వి.గౌరీశంకర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

వేదోక్తంగా సంకట చతుర్ధశి పూజలు




హోమం చేస్తున్న వేద పండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శ్రీఅంజి అంజి వినాయకస్వామి సన్నిధిలో శుక్రవారం సంకట చతుర్థి పూజలను వేదోక్తంగా నిర్వహించారు. ఈ పూజలను ప్రతి కుటుంబమూ చేసుకునేలా ఆర్జిత సేవగా పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. శాస్త్రోక్తంగా గణపతి హోమం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024–25వ విద్యాసంవత్సరంలో జిల్లాలోని మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతిలో చేరేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. అడ్మిషన్లకు ప్రవేశ పరీక్ష ఐదో తరగతికి సబ్జెక్టుల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఏప్రిల్ 6వ తేదీలోపు www.apms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు సంబంధిత మండలాల ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఏప్రిల్ 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

బంగారు తిరుచ్చిపై పద్మావతమ్మ



చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీకృష్ణ స్వామివారి ముఖ మండపంలో అమ్మవారి ఉత్సవర్లకు విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చారు. అనంతరం విశేషాలంకరణలో నాలుగు మాడ వీధుల్లో విహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి కర్పూర నీరాజనాలు అందించారు.

బేరం కుదిరింది!

టికెట్లు ఆశించి భంగపడిన నేతల 'కోట్లా'ట ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇన్నాళ్లు పార్టీ జెండా మోశాం.. సొంత డబ్బులు వెచ్చించి పార్టీ ఉనికిని కాపాడాం.. అంటూ గొప్పలు చెప్పుకున్న టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఆపై టికెట్ రాకపోవడంతో తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. ఆయా పార్టీల అధినేతల తీరుపై కొన్ని రోజులు రుసరుసలాడారు. రహస్య సమావేశాలు, ఎత్తుకుపైఎత్తులు వేస్తూ రహస్య అజెండా నడిపారు. ఆపై బేరం కుదడంతో ఇప్పుడు పార్టీ సిద్ధాంతాలు.. కట్టుబాట్ల గురించి వల్లెవేస్తున్నారు. టికెట్ ఆశించి భంగపడిన నేతలకు పెద్ద మొత్తంలోనే ముడుపులు అందాయని ఆయా పార్టీల నేతలే బహిరంగంగా చెబుతున్నారు.

- టికెట్ దక్కలేదని ఆందోళనలు
- రహస్య సమావేశాలు, ఏడుపులతో హంగామా
- బేరం కుదిరాక సానుకూలంగా ప్రకటనలు
- మాజీలు ఒక్కొక్కరికి రూ.5 కోట్లిచ్చిన కూటమి అభ్యర్థులు
- కార్యకర్తలు, నాయకులకు మొండిచేయి
- చిల్లర నేతతో కుదరని డీల్
- 'అక్రమ' సొమ్మును ఖర్చుచేస్తున్న వైనం



సాక్షి, తిరుపతి : సార్వత్రిక ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడిన నాయకులు, ప్రస్తుత కూటమి అభ్యర్థుల మధ్య బేరం కుదిరింది. భారీ ఎత్తున నగదు, బహుమతులు అందడంతో అసంతృప్తి నాయకులు ఆందోళనలను పక్కనపెట్టారు. ఆశావహుల కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేసిన కార్యకర్తలకు మాత్రం మొండి చేయి చూపించారు. ఏమైందని అడిగితే.. అధిష్టాన నిర్ణయమే శిరోధార్యమంటూ ప్రకటనలు ఇచ్చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తులు, పైరవీలు, ప్యాకేజీల కారణంగా పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు తారుమారయ్యాయి. చిత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, వెంకటగిరి అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని ఇటు టీడీపీ, అటు బీజేపీ, జనసేన శ్రేణులు భావించారు. ముందు నుంచి తనకే టికెట్ వస్తుందని భావించిన నాయకులందరికీ అధినేతలు హ్యాండిచ్చారు. తిరుపతి అసెంబ్లీ టీడీపీకే అనుకున్నారు. కానీ పొత్తులో భాగంగా జనసేన దక్కించుకుంది. చిత్తూరు అసెంబ్లీ టికెట్ మొదటి నుంచి బలిజ సామాజిక వర్గం వారికి ఇస్తారని భావించారు. చంద్రబాబు తన సామాజిక వర్గం వ్యక్తికి ఇచ్చి 'కమ్మ'ని ప్రేమ చాటుకున్నారు. అదే విధంగా చిత్తూరు పార్లమెంట్ స్థానానికి టీడీపీ నాయకులు తమలో ఎవరో ఒకరికి ఇస్తారని భావించారు. స్థానికేతరునికి కేటాయించి చిత్తూరు నాయకుల ఆశలపై నీళ్లు చల్లారు. గంగాధరనెల్లూరు మొదటి నుంచి పార్టీ కోసం పనిచేసిన వారిని అభ్యర్థిగా ప్రకటిస్తారని భావించారు. చెన్నైలో స్థిరపడిన డాక్టర్ థామస్ ఆర్థిక బలాన్ని చూసి ఆయనకు కట్టబెట్టారు. పొత్తులో భాగంగా నగరి బీజేపీకి ఇస్తారని భావించి ఆశోక్ రాజు కమలం కండువా కప్పుకున్నారు. బాబు 'కమ్మ'ని ప్రేమతో గాలి భానుకే కట్టబెట్టారు. సత్యవేడులో మొదటి నుంచి జెండా మోసిన వారెవ్వరినీ కాదని అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే ఆదిమూలాన్ని అభ్యర్థిగా ప్రకటించారు. పొత్తులో భాగంగా శ్రీకాళహస్తి బీజేపీకి లేదా జనసేనకు దక్కుతుందని ఓ వైపు కోలా ఆనంద్, మరో వైపు వినుత ఎదురుచూశారు. మరో వైపు మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు టీడీపీ అభ్యర్థి తానేనని, అందుకే టీడీపీలో చేరానని చెప్పుకుంటూ వచ్చారు. సత్యవేడు టీడీపీ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యేలు హేమలత, తలారి ఆదిత్యతోపాటు జేడీ రాజశేఖర్ ఆశించారు. వీరెవ్వరినీ కాదని వైఎస్సార్ సీపీ వద్దనుకున్న ఎమ్మెల్యే ఆదిమూలానికి టికెట్ ఇచ్చి టీడీపీ కోసం మొదటి నుంచి కష్టపడ్డ వారికి హ్యాండ్ ఇచ్చారు. సూళ్లూరుపేట టికెట్ తమకేనని నెలవల సుబ్రమణ్యం, పరసా వెంకటరత్నం చెప్పుకుంటూ వచ్చారు. చివరకు నెలవల కుమార్తెను అభ్యర్థిగా ప్రకటించారు.

నాడు రేషన్ కార్డు ఇపించలేకపోయావ్.. నీకు మద్దతు ఇవ్వను పో

టీడీపీ హయాంలో అవమాన పడిన నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు పార్టీకి, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో వారిని తమ వైపు తిప్పుకునేందుకు కూటమి నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. ముందుగా వారికి ఫోన్‌చేసి బుజ్జగించే పనిలో పడ్డారు. ఇటీవల తూర్పు నియోజక వర్గాల పరిధిలోని ఓ స్థాయి నాయకుడి నివాసానికి టీడీపీ అభ్యర్థి వెళ్లి పలకరించి బుజ్జగించే ప్రయత్నం చేశారు. 'నాడు అధికారంలో ఉన్నప్పుడు రేషన్ కార్డు, పింఛను కోసం ఎన్నిసార్లు తిరిగినా పనిచేయలేదు. నాకు చేయకపోగా, వేరొకరికి మాత్రం చేసిపెట్టావు. నా ఊర్లో కనీసం ఒక్కడికీ రేషన్ కార్డు, పింఛను ఇప్పించలేని వాడిని నేను మీకు ఎందుకు మద్దతు ఇవ్వాలి. మీ అవసరం నాకొద్దు. నా మద్దతు నీకు ఇవ్వను పో' అని ఘాటుగా సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. ఈ సారి మద్దతు ఇస్తే.. ఇకపై అలా జరగదు, నీకు ఇప్పుడు ఏం కావాలో చెబితే చేస్తాను. అధికారం వస్తే పెత్తనం అంతా నీకే ఇప్పిస్తాను' అని సదరు అభ్యర్థి హామీ ఇచ్చినట్లు సమాచారం. అభ్యర్థి మాటలు నమ్మని ఆ నాయకుడు ఆలోచించుకుని చెబుతాను అని చెప్పి పంపేయడం కొసమెరుపు.

అసంతృప్తులు, అభ్యర్థి మధ్య కుదిరిన డీల్

ఓటమి భయంతో పొత్తులు పెట్టుకున్న చంద్రబాబు నమ్మిన వారిని నట్టేటముంచడంతో టికెట్ ఆశించి భంగపడ్డ వారంతా ఎదురు తిరిగారు. నిజాయితీగా పార్టీ కోసం పనిచేసిన మస్తాన్‌యాదవ్ లాంటి వారు టీడీపీకి రాజీనామా చేశారు. మరి కొందరు ప్యాకేజీల కోసం బెదిరించి, భయపెట్టి డబ్బు తీసుకుని సైలెంట్‌గా ఉంటున్నారు. అధికారంలో ఉన్నన్ని రోజులు అక్రమంగా సంపాదించిన సొమ్మును నేడు ఎన్నికల కోసం విచ్చలవిడిగా ఖర్చుచేస్తున్నారు. అందులో భాగంగా కూటమిలోని అసంతృప్త నాయకులకు నగదు, విలువైన బహుమతులు ఇచ్చి నోరెత్తకుండా చేశారు. వారిని నమ్ముకుని ఆందోళనలు చేసిన కార్యకర్తలకు రూపాయి కూడా ఇవ్వలేదని విశ్వసనీయ సమాచారం. ఉమ్మడి జిల్లాలో మాజీ ప్రజా ప్రతినిధులకు భారీగానే నగదు ముట్టజెప్పినట్లు కూటమి నాయకులే బహిరంగంగా చెప్పుకుంటుంటున్నారు. కొన్నేళ్లుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న మాజీల నివాసాలకు వెళ్లి మరీ కండువా కప్పి తమకు మద్దతు ఇచ్చినట్లు తమ ఎల్లో మీడియాలో పెద్ద పెద్ద అక్షరాలతో ప్రచారం చేయించుకుంటున్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలో దాదాపు 15 మంది వరకు మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో ఐదారుగురికి ఒక్కొక్కరికి రూ.5 కోట్ల చొప్పున ముడుపులు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఓ మోస్తరు మాజీలకు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు ఇచ్చి మద్దతు కోరినట్లు సమాచారం. తిరుపతికి చెందిన ఓ చిల్లర నాయకుడు మాత్రం రూ.2 కోట్లు చాలవని రూ.5 కోట్లు రాబట్టుకునేందుకు ఇంకా భీష్మించుకుని మధ్యస్తాలు నెరుపుతున్నాడు.

రేపు సూళ్లూరుపేటలో జాబ్‌మేళా

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు జేకేసీ, వికాస్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రతినిధులు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బీ శంకరశర్మ తెలిపారు. సూళ్లూరుపేట, సత్యవేడు నియోజకవర్గాల పరిధిలో విస్తరించి వున్న శ్రీసిటీ సెజ్‌లోని ఇసుజు, ఇన్‌ఫ్లిమ్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. విద్యార్హతను బట్టి రూ.12,500 నుంచి రూ.25 వేల వరకు జీతం పొందవచ్చన్నారు. జాబ్‌మేళాకు వచ్చే వారు ఆధార్ కార్డు, మార్కుల జాబితా, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలు తీసుకురావాలని తెలిపారు. వివరాలకు జేకేసీ కోఆర్డినేటర్, ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ సునీత 98482 40463, జేకేసీ మెంటార్ ఎస్ యామిని 89851 22117, జీకే ప్రసాద్ 94407 53860లో సంప్రదించాలని సూచించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు

తిరుపతి సిటీ : తిరుపతి నగరంలోని ఎల్‌ఎస్ నగర్‌లో ఉన్న గ్లోబల్ ట్రెండ్స్ హెచ్‌ఆర్ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌లో నిరుద్యోగ యువతతో పాటు విద్యార్థులకు బేసిక్ కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కేఎస్ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బేసిక్స్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ కోర్సులో సైతం ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తిగల యువతీ, యువకులు ఎల్‌ఎస్ నగర్ చాముండేశ్వరి గుడి వెనుకనున్న తమ సంస్థలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఐటీ ఆధారిత ఉద్యోగ అవకాశాల సమాచారాన్ని అందించి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ) ద్వారా పరీక్ష ఫీజుతో పలు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను అందిస్తున్నామని వెల్లడించారు. వివరాలకు 94401 33535లో సంప్రదించాలని కోరారు.

సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీకి శ్రీరామ రక్ష



తిరుపతి 21వ డివిజన్ ఎంఆర్‌పల్లిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- 21, 22 డివిజన్లలో ప్రచారం
- అభినయ్‌రెడ్డిని ఆశీర్వదించాలని వినతి

తిరుపతి మంగళం : రాష్ట్రంలోని ప్రజలంతా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉన్నారని, ఆయన అందించిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందిస్తాయని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మేయర్ డాక్టర్ శిరీష, పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, కార్పొరేటర్లు ఈశ్వరి, సునీత, వార్డు అధ్యక్షుడు పడమటి కుమార్‌తో కలిసి తిరుపతిలోని 21, 22వ డివిజన్లలో ప్రచారం చేశారు. ఆయనకు ప్రతి గడపలోనూ ఘన స్వాగతం లభించింది.

మహిళలు హారతులు పట్టి, గజమాలలతో సత్కరించి పూలవర్షం కురిపించారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలు మా జీవితాలనే మార్చేశాయని, తిరుపతిలో అభినయ్‌రెడ్డి చేసిన అభివృద్ధి మరిచిపోలేమని సంతోషం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి జగనన్న రుణం తీర్చుకుంటామని ముక్తకంఠంతో చెప్పారు. భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి అజెండాగా జగనన్న పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి రావాలన్న దురాలోచన చంద్రబాబుదన్నారు. 14 ఏళ్ల అధికారంలో ఉన్నా ప్రజలకు ఒక మంచి పనీ చేయలేదని దుయ్యబట్టారు. అందువల్లే ఇప్పుడు ఒంటరిగా పోటీ చేసే దమ్ములేక జనసేన, బీజేపీతో పొత్తులు పెట్టుకున్నాడని విమర్శించారు. ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా, ఎన్ని ఎత్తులు వేసినా చివరకు చిత్తు అవుతారని తెలిపారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, వారంతా జగనన్న వైపే ఉన్నారని పేర్కొన్నారు. రూ.1700 కోట్లతో తిరుపతిలో అనేక అభివృద్ధి పనులు చేశామని, అందుకు జగనన్న సహకారమే కారణమన్నారు.

ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అభినయ్‌రెడ్డిని ఎమ్మెల్యే గెలిపించాలని, తిరుపతి నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, పాముల రమేష్ రెడ్డి, దుద్దేల బాబు, దేవదానం, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, ఆరణి సంధ్య, పడమటి కుమార్, అనీల్, తిమ్మారెడ్డి, మబ్బు నాదమునిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, గణేష్, నాగరాజు, సుబ్రమణ్యం, జీవరత్నం, కడపగుంట అమరనాథ్‌రెడ్డి, తాళ్లూరి ప్రసాద్, కంకనాల రమేష్, సుధా పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కింద శిక్ష పడితే ఓటు కట్!

ఎట్టెట్టా...!



జైలులో ఉన్న ఖైదీలకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించిన రాజ్యాంగం, ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించలేదు. సివిల్ కేసుల్లో జైలులో ట్రయల్స్ కింద ఉన్న వారు కూడా ఓటు వేయలేరు. అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడి పోలింగ్ రోజుల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న వారికీ ఓటు హక్కు ఉండదు. పీడీ యాక్ట్ (ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్) కింద అరెస్ట్ అయి శిక్ష అనుభవిస్తున్న వారు మాత్రం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. పీడీ యాక్ట్ కింద అరెస్ట్ అయిన వారి వివరాలను ఎన్నికల సంఘం నియోజకవర్గాల వారిగా అధికారులకు పంపిస్తుంది. దీంతో పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారు ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. – తిరుపతి సిటీ

జగనన్న పథకాలకు జైకొట్టిన టీడీపీ నేతలు

- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, మండల నాయకులు


రామచంద్రాపురం: మండలంలోని కాలేపల్లి పంచాయతీ చిట్టత్తూరులో అనేక ఏళ్లుగా టీడీపీలో కొనసాగిన పలు కుటుంబాలు నేడు సీఎం జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధికి జై కొట్టారు. చిట్టత్తూరుకు చెందిన టీడీపీ నాయకులు నాగరాజు, చెంచునారయ్య, గోవిందయ్య, కృష్ణారెడ్డి, రవిరెడ్డి, మునిచంద్రయాదవ్ తదితర 13 కుటుంబాల వారు శుక్రవారం తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మోహిత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలవడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ మంజుల సిద్ధమునిరెడ్డి, సర్పంచి మురగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు యశ్వంత్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, మొగిలరెడ్డి, బాలకృష్ణారెడ్డి, మురగారెడ్డి, విజయకుమార్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వెంకటేష్, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబు హేళన.. డ్రైవర్ల ఆగ్రహం

- డ్రైవర్లపై నోరుపారేసుకున్న చంద్రబాబు
- శింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి టిప్పర్ డ్రైవర్ అంటూ అవమానం
- వెంటనే క్షమాపణ చెప్పాలని డ్రైవర్ల సంఘం డిమాండ్
- లేకుంటే బాబుకు బుద్ధి చెబుతామని ప్రతిన

చంద్రబాబునాయుడుకు పేదలంటే గిట్టదు. దళితులన్నా, బడుగు, బలహీన వర్గాలన్నా ఆయనకు పడదు. అందుకే బహిరంగ సభలు, అసెంబ్లీ సమావేశాల్లో వారిని హేళనగా మాట్లాడేస్తుంటారు. సాక్షాత్తు అసెంబ్లీలోనే 'ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా..?' అంటూ దళితులను తీవ్రంగా అవమానపరిచారు. ఆపై నాయీబ్రాహ్మణులను తన దరికి చేరకుండానే కించపరిచి వెలుపులకు పంపేయడం గతంలో చర్చనీయాంశమైంది. ఇప్పుడు ఎడమచేత్తో వేలిముద్రలేసేవారు టిప్పర్ డ్రైవర్లంటూ శింగనమల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని ఉద్దేశించి చులకనగా మాట్లాడడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై జిల్లాలోని డ్రైవర్లు అగ్గిమీదగుగ్గిలమవుతున్నారు. దళితులు వేలిముద్రగాళ్లని, డ్రైవర్లని నోటికొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని మండిపడుతున్నారు. రాబోయే ఎన్నికల్లో బాబుకు రాజకీయ సమాధి కట్టడం ఖాయమని ప్రతిన బూనుతున్నారు. వెంటనే డ్రైవర్లందరికీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఆందోళన తప్పని హెచ్చరిస్తున్నారు. – చిత్తూరు రూరల్/బైరెడ్డిపల్లి/నగరి/తిరుపతి సిటీ


బాబులో ఓటమి భయం కనిపిస్తోంది



డ్రైవర్లనే కాదు, గతంలో ఎస్సీలను, నాయీ బ్రాహ్మణులను సైతం ఇదే రీతిలో అసభ్య పదజాలంతో అవమానించాడు. సీఎం జగన్ పేదల పక్షపాతి. కష్టం విలువ తెలిసిన నాయకుడు. అందుకే టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. ఇది సాహసమనే చెప్పాలి. పేద, మధ్యతరగతి కుటుంబాలు జగనన్న పక్షాన నిలిచి మరో మారు సీఎంగా గెలిపించుకుంటారు. బాబును ప్రజలు పట్టించుకోవడం లేదు. అందుకనే ఆయన ఇలాంటి నీచపు మాటలకు తెరతీస్తున్నారు.

– పి.కరుణాకర్, క్యాబ్ డ్రైవర్, తిరుపతి

డ్రైవర్లంతా రోడ్డెక్కుతాం



రాష్ట్రంలోని డ్రైవర్లంతా రోడెక్కితే తినే తిండికి కూడా తిప్పలే. ఎక్కడికక్కడికి బండ్లు ఆపేసి చంద్రబాబుపై యుద్ధం ప్రకటిస్తాం. అప్పుడు తెలుస్తుంది డ్రైవర్ల సత్తా ఏమిటో. డ్రైవర్లను హేళన చేసి మాట్లాడడం కరెక్ట్ కాదు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం. కచ్చితంగా చంద్రబాబు క్షమాపణ చెప్పాలి. మాలాంటి డ్రైవర్లకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వడం గిట్టక, అతనితో ఒడిపోతే.. పరువు పోతుందని చంద్రబాబు భావిస్తున్నట్లు ఉంది. –త్యాగరాజులు, టిప్పర్‌డ్రైవర్, గుడిపాల


పేదల వ్యతిరేకి చంద్రబాబు



చంద్రబాబు నాయుడు పేదల వ్యతిరేకి. ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటిస్తూ నిరుపేద అయిన టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే సీటు కేటాయించిన పేదల పక్షపాతి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. నిరుపేద టిప్పర్ డ్రైవర్‌కు రాజకీయ అవకాశం కల్పించడాన్ని జీర్ణించుకోలేని బాబు బహిరంగ సభలో హేళనగా మాట్లాడడం దారుణం. తన 14 ఏళ్ల పాలనలో బడుగు, బలహీన వర్గాల వారిపై దాడులు చేసి అగౌరవ పరిచారు.

– కె.కేశవులురెడ్డి, శ్రీలక్ష్మి వెంకటేశ్వర వైట్ బోర్డ్ కార్ డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, తిరుపతి

డ్రైవర్ విలువ తెలుసా బాబు?



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డ్రైవర్ లేకుండా ఎక్కడికైనా వెళ్లగలడా.. డ్రైవర్ విలువ తెలిసి కూడా డ్రై వర్లను హేళన చేస్తూ మాట్లాడడం సమంజసం కాదు. పేదలకు ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే తప్పేంటి. డ్రైవర్లను చులకన చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. -శ్రీనివాస్, డ్రైవర్, బైరెడ్డిపల్లె

మా సత్తా ఏంటో చూపిస్తాం



చంద్రబాబు డ్రైవర్లను హేళన చేసి మాట్లాడితే ఊరుకోం. టీడీపీ హయంలో చంద్రబాబు ఓ సభలో ఎస్సీగా ఎవరైనా పుడతారా..?అని ఎస్సీలను చులకన చేశారు. అందుకే 2019 ఎన్నికలో ఎస్సీలంతా కలిసి తగిన బుద్ధి చెప్పారు. ఇప్పుడు డ్రైవర్లంటూ హేళన చేశారు. ఈసారి ఎన్నికల్లో మా సత్తా ఏంటో చూపిస్తాం. -చిట్టిబాబు, ఆటోడ్రైవర్, చిత్తూరు

మత్స్యకారుల సంక్షేమానికి పెద్ద పీట


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- మత్స్యకారులతో ఆత్మీయ సమావేశం


ఎమ్మెల్యే కిలివేటితో ఫోటోలు దిగుతున్న మత్స్యకార మహిళలు

తడ: సముద్రంలోకి వెళ్లి చేపల వేట తప్ప మరో ప్రపంచం తెలియని జాలర్లు అంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఎనలేని ప్రేమ అని, అందుకే ఆయన మత్స్యకారుల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. తడలోని ఓ ప్రైవేటు గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన మత్స్యకారుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు మత్స్యకారులు ఘన స్వాగతం పలికారు. కిలివేటి మాట్లాడుతూ చంద్రబాబు మత్స్యకారులను చిన్న చూపు చూశాడని, జగనన్న మాత్రం రాజ్యసభ సభ్యులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, టీటీడీ బోర్డు సభ్యులు, జెడ్పీ ఉపాధ్యక్షురాలు వంటి అనేక ఉన్నత పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. తిరుమలేశుని సేవ చేసుకునే భాగ్యాన్ని మత్స్యకార బిడ్డతోపాటు తనకు కూడా కల్పించడం మామూలు విషయం కాదన్నారు. చేపల వేట నిషేధ సమయంలో ఇస్తున్న జీవన భృతిని రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచినట్టు గుర్తు చేశారు. తమిళనాడులో నేటికీ రూ.4 వేలు మాత్రమే ఇస్తున్నారని వివరించారు. వృద్ధాప్య పింఛను వయసును 65 నుంచి 50 ఏళ్లకు తగ్గించి రూ.మూడు వేలు ఇస్తూ అడగక పోయినా పేదలకు ఎలా మేలు చేయవచ్చో చేసి చూపించారని తెలిపారు. జాలర్ల పిల్లలకు చదువుల కోసం తడలో రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పులికాట్ ముఖద్వారం పూడికతీత పనులకు అడ్డంకులు తొలగాయని, ఎన్నికల అనంతరం టెండర్లు పిలిచి పనులు మొదలు పెడతామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, తడ సర్పంచ్, మత్స్యకార సీనియర్ నాయకుడు కె.ఆర్ముగం, తడ ఎంపీటీసీ భర్త తుమ్మిని కోదండం, వైస్ ఎంపీపీ చిన్నప్పన్ రమేష్, పెరియవట్టు సర్పంచ్ చిన్నప్పన్, మత్స్యకార నాయకులు వరప్రసాద్, దేశింగ్, గుణ, ఆళయ్య, ఏళయ్య, శివకుమార్, రాజేంద్రన్, రాందాస్, చంద్రన్, ఆంధ్ర సరిహద్దు మత్స్యకార సంఘం అధ్యక్షుడు వాసు, తమిళనాడు సంఘం అధ్యక్షుడు శివలింగం తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే మాకు గుర్తింపు



జగనన్న ప్రభుత్వం వచ్చాక మాకు గుర్తింపు వచ్చింది. తమిళం తప్ప తెలుగు తెలియని మాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంటి వద్దకే వచ్చి అన్నీ చేరుతున్నాయి. తమిళనాడులో ఇప్పటికీ పింఛను ఐదు వందలు మాత్రమే ఇస్తున్నారు. మాకు మాత్రం మూడు వేలను తెల్లారే సరికి ఇంటికే రావడం ఎంతో సంతోషంగా ఉంది.

– వాటంబేటి సుధ, తడ కుప్పం

తమిళనాడును చూసి అసూయ పడేవాళ్లం



గతంలో తమిళనాడులో అందుతున్న సంక్షేమ పథకాలను చూసి అసూయ పడేవాళ్లం. ఇక్కడ రేషన్‌దుకాణంలో ఇచ్చే పచ్చి బియ్యం తప్ప ఎలాంటి మేలూ ఉండేది కాదు. మాకు పక్కనే ఉన్న తమిళ కుప్పాల్లో ఎన్నో ప్రభుత్వ పథకాలు అందేవి. జగనన్న వచ్చాక అక్కడి వాళ్లు మనల్ని చూసి అసూయ పడుతున్నారు. అదే జగనన్న దెబ్బ.

– చంద్రన్, ఇరకం

పాలిటెక్నిక్ కోర్సులతో ఉజ్వల భవిత


పాలిసెట్‌పై అవగాహన కల్పిస్తున్న విశ్వనాథరెడ్డి

- ఏప్రిల్ 27వ పాలిసెట్
- దరఖాస్తు గడువు 31

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో శుక్రవారం పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ అవగాహన సదస్సు, పాలిసెట్ నమూనా ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పాలిటెక్నిక్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ ఇంజినీరింగ్, మైనింగ్, కెమికల్, బయో మెడికల్, త్రీడీ యానిమేషన్ అండ్ గ్రాఫిక్స్, పెట్రోలియం, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్), మెకానికల్ రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండిషనర్, డిజైన్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ, షుగర్ టెక్నాలజీ వంటి డిప్లొమో కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పాలిటెక్నిక్ డిప్లొమో అనంతరం ప్రవేశ పరీక్ష ద్వారా నేరుగా ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చన్నారు. పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో లభిస్తుందని, అలాగే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో డిప్లొమో పూర్తి చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 27వ తేదీ పాలిటెక్నిక్ పాలిసెట్ ప్రవేశ పరీక్షను రాష్ట్ర వ్యాప్తంగా సాంకేతిక విద్యా శాఖ నిర్వహించనుందని, ఆసక్తి ఉన్న వారు ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
- చరిత్రలో నిలిచేలా వెంకటగిరి అభివృద్ధి

జగనన్న అంటేనే నమ్మకం


మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


బొలిగర్ల మస్తాన్‌యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, గురుమూర్తి తదితరులు

వెంకటగిరి(సైదాపురం) : ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి జగన్ అంటేనే నమ్మకమని చాటుకున్నారని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలో శుక్రవారం బొలిగర్ల మస్తాన్‌యాదవ్ సారథ్యంలో నిర్వహించిన బీసీ సమరోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తితో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం జగనన్న నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలు అంటూ బడుగు, బలహీన వర్గాల వారికి సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 100 సీట్లు కేటాయించి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. మాట ఇస్తే తప్పక చేస్తాడన్న నమ్మకాన్ని కలిగించడం జగనన్నకే సాధ్యమని వివరించారు. బొలిగర్ల మస్తాన్‌యాదవ్ చేరికతో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలం మరింత పెరిగిందన్నారు. అందరమూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి తమను గెలిపించాలని, వెంకటగిరిని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఎంపీ అభ్యర్థి గురుమూర్తి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వైఎస్సార్‌సీపీ సముచిత స్థానం ఇచ్చిందని గుర్తు చేశారు. బొలిగర్ల మస్తాన్‌యాదవ్ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు జయహో బీసీ అని కేవలం నినాదాలకే పరిమితమయ్యారని తెలిపారు. బీసీలకు ఏనాడూ సముచిత స్థానం కల్పించలేదన్నారు. బీసీలంటేనే చిన్నచూపు చూస్తారని పేర్కొన్నారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో బీసీ నేతలకు తీరని అన్యాయం చేశారని తెలిపారు. వైఎస్సార్ సీపీలో బడుగు, బలహీన వర్గాలకు ఉన్నత పదవులు ఇచ్చారని తెలిపారు. తాను సైనికుడిలా పనిచేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తి విజయానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ చింతపట్ల ఉమామహేశ్వరి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవిక చౌదరి, విప్ పి.లక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, డక్కిలి ఎంపీపీ గోను రాజశేఖర్, సైదాపురం, కలువాయి వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు మన్నారపు రవికుమార్‌యాదవ్, కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ అనీల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నింటా డేగ కన్ను

- సోషల్ మీడియా, టీవీలు, రేడియా ప్రసారాలపైనా ప్రత్యేక దృష్టి
- జిల్లాలో దివ్యాంగుల ఓట్లు 24,481
- ఎన్‌ఆర్‌ఐ ఓట్లు 287


ఎంసీఎంసీ సెంటర్‌లో టీవీల్లో వస్తున్న ప్రసారాలను పరిశీలిస్తున్న సిబ్బంది


ఓటర్ల అవగాహన ర్యాలీలో కలెక్టర్ లక్ష్మీశ, తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి తదితరులు

తిరుపతి అర్బన్ : 2024 సార్వత్రిక ఎన్నికలను పటిష్టంగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం శ్రమిస్తోంది. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సైతం ఓటింగ్ శాతాన్ని పెంచడంతోపాటు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నెల 16న ఎన్నికల షెడ్యూలు విడుదలైనప్పటి నుంచి ప్రత్యేక ప్రణాళికలను అమలుచేస్తోంది. మే 13న పోలింగ్ జరగనున్న ప్రాంతాల్లో గట్టి భద్రతా చర్యలూ తీసుకుంటోంది. అలాగే సోషల్ మీడియాలో పోస్టులు, టీవీలు, రేడియో ప్రసారాలపైనా ప్రత్యేక దృష్టి సారించింది.

తిరుపతి జిల్లాలో 17.94 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. 2,136 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. వాటిలో ఏప్రిల్ 5వ తేదీ నాటికి వంద శాతం వసతులు కల్పించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రధానంగా విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యంతోపాటు షామియానాలు, పార్కింగ్ స్థలం కేటాయింపు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, సూచిక బోర్డుల ఏర్పాటు, పోలింగ్ కేంద్రం సమీప ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం తదితర పనులను జోరుగా చేస్తున్నారు. మరోవైపు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉన్న 33 శాఖల సిబ్బందికి తగిన వసతులు కల్పిస్తున్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచడానికి కలెక్టర్ నేతృత్వంలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సోషల్ మీడియా, టీవీలు, రేడియో ప్రసారాలపై ప్రత్యేక నిఘా

సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు, టీవీల కథనాలు, రేడియో ప్రసారాలపైనా ఈ సారి ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా పెట్టింది. ఇందులో భాగంగా వాటిని పరిశీలించేందుకు తిరుపతి కలెక్టరేట్‌లోని ఎంసీఎంసీ కార్యాలయం వద్ద ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసింది. ఆయా బృందాల్లోని సభ్యులు ఏ రోజుకారోజు వార్తలను పరిశీలించి అధికారులకు నివేదికలు ఇస్తున్నారు. ఈ బృందాలను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమర్థవంతంగా పనిచేసేలా చూస్తున్నారు.

జిల్లా సమాచారం...	
ఓటర్లు	17,94,733 మంది (మార్చి 16వ తేదీకి)
యువ ఓటర్లు	36,162 మంది
సర్వీస్ ఓటర్లు	867
సీనియర్ సిటిజన్స్	7,940 (85 ఏళ్లు దాటిన వారు)
ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు	287
దివ్యాంగుల ఓటర్లు	24,481
పోలింగ్ కేంద్రాలు	2136
సమస్యాత్మక కేంద్రాలు	660
ఉద్యోగులు	13,243 మంది
బ్యాలెట్ యూనిట్లు	6,458
కంట్రోల్ యూనిట్లు	5,149
వీవీప్యాట్‌లు	6,291

దివ్యాంగుల ఓట్లు	పురుషులు	మహిళలు	మొత్తం ఓటర్లు
గూడూరు	1,773	1,392	3,165
సూళ్లూరుపేట	2,310	1,880	4,190
వెంకటగిరి	1,985	1,462	3,447
చంద్రగిరి	2,351	1,857	4,208
తిరుపతి	1,095	917	2,012
శ్రీకాళహస్తి	1,886	1,388	3,274
సత్యవేడు	2,467	1,718	4,185
మొత్తం	13,867	10,614	24,481

ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు	పురుషులు	స్త్రీలు	మొత్తం
గూడూరు	39	07	46
సూళ్లూరుపేట	22	05	27
వెంకటగిరి	26	08	34
చంద్రగిరి	36	10	46
తిరుపతి	75	19	94
శ్రీకాళహస్తి	19	02	21
సత్యవేడు	16	03	19
7 నియోజకవర్గాల్లో	233	54	287

ఎన్నికల ప్రక్రియ వేగవంతం



“ఎన్నికల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రక్రియను మరింత వేగవంతం చేశాం. ప్రతి అంశంపైనా పక్కా ప్రణాళికలు రూపొందించాం. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి అన్ని చర్యలూ తీసుకున్నాం. అధికారులు తమకు అప్పగించిన పనుల్లో నిమగ్నమయ్యారు. సార్వత్రిక ఎన్నికలను సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహిస్తాం. – లక్ష్మీశ, కలెక్టర్, తిరుపతి

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 30 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధ రాత్రి వరకు 65,992 మంది స్వామివారిని దర్శించుకోగా, 25,698 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.53 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం


పూర్తిగా కాలిన ఇంటిలో వస్తువులను పరిశీలిస్తున్న బాధితులు

చిట్టమూరు(చిల్లకూరు) : చిట్టమూరు మండలం కోగిలిలో శుక్రవారం గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు కోగిలి గ్రామానికి చెందిన రాయపు మణేంద్ర భార్య పూజ శుక్రవారం ఉదయం వంట చేసేందుకు ప్రయత్నించింది. ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ వద్ద మంటలు చెలరేగాయి. ఆమె కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. ఈ క్రమంలో సిలిండర్ పేలి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. చుట్టు పక్కల వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించేలోపే గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు.

బైక్ పార్కింగ్ విషయంలో గొడవ

గూడూరు రూరల్ : ద్విచక్ర వాహనం పార్కింగ్ విషయంలో గొడవ పడి యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గురుకుల పాఠశాలలో చదువుతున్న తమ్ముడి కోసం ఒక యువకుడు ద్విచక్ర వాహనంలో వచ్చాడు. వాహనాన్ని పార్కింగ్ చేసి పాఠశాలలోకి వెళ్లి వచ్చాడు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన మరో యువకుడు బైక్‌ను అడ్డంగా పెడతావా అంటూ వాగ్వాదానికి దిగాడు. అంతటితో ఆగక ఆగ్రహంతో ఊగిపోతూ కీ చైన్‌కు ఉన్న చాకుతో దాడి చేసి గాయపరిచాడు. బాధిత యువకుడు గూడూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు, నిందితుడు మైనర్లు కావడంతో పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఈ ఆదివారం బ్యాంకులకు సెలవు లేదు

తిరుపతి(అలిపిరి): ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతో ఈ ఆదివారం బ్యాంకులకు సెలవు లేదు. మార్చి 31న బ్యాంకులు పని చేయనున్నాయి. ప్రభుత్వ లావాదేవీలు, ట్యాక్స్ చెల్లింపులు, తదితరాలకు ఆటంకం లేకుండా ఆర్బీఐ ఈ మేరకు బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. ఎస్బీఐ సహా 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు, 20 ప్రైవేట్ బ్యాంకులు, విదేశీ బ్యాంకైన డీబీఎస్ బ్యాంక్ ఇండియా కస్టమర్లకు సేవలు అందించనున్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు.

ఆకట్టుకున్న టాలెంట్ ఫెస్ట్

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో నాలుగు రోజుల పాటు కొనసాగనున్న టాలెంట్ ఫెస్ట్-2024 ఘనంగా జరుగుతోంది. రెండవ రోజు శుక్రవారం యోగాసన స్పందన పోటీల్లో పలు యూనివర్సిటీల నుంచి విచ్చేసిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో పాటు సంస్కృత గీతాగానం, మోనో యాక్టింగ్, అంత్యాక్షరి, వేదభాష్య, సాహిత్య, మీమాంస, జ్యోతిష్య, వ్యాకరణ, న్యాయ, సంఖ్యాక, ఆగమ భాష్యాల్లో జరిగిన పోటీలకు సుమారు 400మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సంస్కృత విద్యార్థులలోని దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు టాలెంట్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశం నలుమూలలోని 21 సంస్కృత విద్యాలయాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. పలు వర్సిటీల వీసీలు, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.13.2 లక్షల నగదు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదు చూపుతున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్

సైదాపురం : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా చేపట్టిన తనిఖీల్లో రూ.13.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ డీఎస్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సైదాపురంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టామని వివరించారు. ఈ సందర్భంగా గూడూరు నుంచి గొర్రెలను తరలిస్తున్న ఐదు వాహనాలను పరిశీలించినట్టు పేర్కొన్నారు. వారి వద్ద ఉన్న రూ.13.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వారు ఆ నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. రూ.50 వేలకు మించి నగదును తరలిస్తే తప్పనిసరిగా సరైన పత్రాలు చూపాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజల అండదండలే జగనన్నకు శ్రీరామరక్ష


యువతకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి, మాధవరెడ్డి

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- వైఎస్సార్‌సీపీలో చేరిన 150 మంది టీడీపీ యువత

నాయుడుపేట టౌన్ : ప్రజల అండదండలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య తెలిపారు. నాయుడుపేటలోని శ్రీరామ్ నగర్ ఏరియా వద్ద శుక్రవారం సాయంత్రం 150 మంది టీడీపీ యువత వైఎస్సార్ సీపీ నాయకుడు కలికి మాధవ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే సంజీవయ్య పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గతంలో ఏ ప్రభుత్వాలూ చేయని విధంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలతో పాటు మహిళ సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్టు తెలిపారు. రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారిని సైతం లెక్క చేయకుండా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. పార్టీలో చేరిన యువత జగనన్న సైనికులుగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, గతంలో చంద్రబాబు చేసిన మోసాలను వివరించి ప్రజల మద్దతు కోరాలన్నారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలించాలని ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ చదలవాడ కుమార్, విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి మీజూరు బాల, ఓజిలి మండల కన్వీనర్ పాదర్తి హరినానాథ్‌రెడ్డి, టింబర్ సురేష్, మునిరత్నం ఆచారి, మెంటా వెంకటేశ్వర్లు, ఇంతియాజ్, షాజహాన్, పేర్నాటి వాసు, నరేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.